క్లుప్తంగా

నేడు పిచ్చాటూరులో ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు: పిచ్చాటూరులో ఆదివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ.చలపతిరాజు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాల వారికి దుప్పట్లు పంపిణీ చేస్తారన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రత్యేక అవసరాల వారికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు



బీఎన్‌కండ్రిగ: ఓటరు లిస్టును పరిశీలిస్తున్న బీఎల్‌ఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దారు భార్గవి తెలిపారు. బీఎల్‌ఓలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారని, చేర్పులు, మార్పులు, డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు తదితరాలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. డోర్ నంబర్లు లేకుండా, ఒకే డోర్ నంబరుపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లను పరిశీలిస్తారని తెలిపారు.

ఉపాధిలో గ్రామాభివృద్ధి పనులు

ఏర్పేడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని ప్రాజెక్ట్ మేనేజర్ మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చెరువు కట్టల బలోపేతం, రైతులకు ఉపయోగ పడే పంట, వరవ కాల్వలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల పొలాల్లో మామిడి, పూల తోటల పెంపకం తదితర పనులను చేయాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఏర్పేడులో స్తంభించిన ట్రాఫిక్



ఏర్పేడులో ఆగిన వాహనాలు

ఏర్పేడు: మండల కేంద్రంలో భారీ వాహనాల రాకతో శనివారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 6.50 గంటలకు వెంకటగిరి రోడ్డు నుంచి ఆరులేన్ల రోడ్డు పనులకు మట్టిని తరలించే లారీలు ఏర్పేడులోని కూడలిలో తిరుపతి వైపునకు రావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం జరిగింది. రాత్రి 6.50 నుంచి 7.40 గంటల వరకు రోడ్డుకు ఇరువైపుల 3 కిలోమీటర్ల దూరం వాహనాలు రోడ్డుపై ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వాహనాల పునరుద్ధరించారు. పోలీసుల పర్యవేక్షణ లోపంతో తరచూ ఇలా జరుగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఆడుదాం ఆంధ్రాకు నమోదు చేసుకోండి

ఏర్పేడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆడుదాం ఆంధ్రాకు యువత పేర్లు నమోదు చేసుకోవాలని సర్పంచ్ మోహన ప్రియ అన్నారు. శనివారం మండలంలోని ఎండీపుత్తూరు సచివాలయంలో ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామీణ యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈపోటీలను నిర్వహిస్తోందని వివరించారు. ఆసక్తి ఉన్న యువకులు సచివాలయంలో పేర్లు నమోదు చేసుకుని క్రీడల్లో పాల్గొనాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి లోకముని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెయిన్ కోట్ల పంపిణీ



నాగలాపురం: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి జెడ్పీటీసీ సభ్యుడు మహేష్‌రెడ్డి శనివారం రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షానికి సిబ్బంది తడుస్తూ ఇబ్బందులు పడుతుండడంతో వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు.

5,6 తేదీల్లో ఏడు గంగమ్మల జాతర

- సమష్టికృషితో విజయవంతం చేద్దాం
- శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు
- నిర్వహణ కమిటీలు, అధికారులతో సమావేశం



భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఈనెల 5,6 తేదీల్లో ఏడుగంగమ్మల జాతరను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయ కల్యాణ మండపంలో శనివారం ఏడుగంగల జాతర నిర్వహణపై గంగమ్మ కమిటీలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలు ఏడుగంగమ్మల జాతర నిర్వహణలో నిమగ్నమై ఉన్నాయని, కమిటీకి గుర్తింపు ఇస్తూ వారి ద్వారానే సారె అందజేసే విధంగా చూస్తామన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సారెను సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సీఐ అంజూయాదవ్ మాట్లాడుతూ అందరి సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ చేస్తామని, భారీ బందోబస్తు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ పట్టణ వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో స్వర్ణమూర్తి, అంజూరు బాలసుబ్రహ్మణ్యం, సెన్నీరు కుప్పం శేఖర్, మొగరాల గణేష్, హరినాథ్, సురేష్ గురుకుల్, రవి, శంకర్, కిషోర్, గురుమూర్తి, విజయ కుమార్, బాల, బాలగౌడ్, యువకిషోర్, రవికిరణ్, ప్రభాకర్, రవి, హరి, లక్ష్మీపతి, శేఖర్ పాల్గొన్నారు.



జాతర కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

నిత్యాన్నదాన కేంద్రం పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన కేంద్రాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. అన్నప్రసాదాలను తనిఖీ చేశారు. కూరగాయలు, సరుకులను పరిశీలించారు. భక్తులను అడిగి నాణ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అన్నప్రసాద వితరణ సమయంలో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చెన్నైకు వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు సచివాలయ పరిధిలోని నాగనందాపురం గ్రామానికి చెందిన మూగాల లక్ష్మికి చెన్నైకు వెళ్లి వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్ పింఛన్ అందజేశారు. లబ్ధిదారు బోన్ క్యాన్సర్‌తో చెన్నై జీహెచ్‌లో వైద్యం పొందుతోంది. సమాచారం అందుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్ సొంత ఖర్చులతో శనివారం చెన్నైకి వెళ్లి ఆస్పత్రిలో ఆమెకు రూ. 5వేల పింఛన్ అందజేశారు. ఇంతదూరం వచ్చి పింఛన్ అందజేసి సకాలంలో ఆదుకున్నందుకు వెల్ఫేర్ అసిస్టెంట్‌కు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- చెరువు కట్టల వద్ద నిఘా ఉంచాలి
- ప్రమాద సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలి
- అధికారులకు తహసీల్దార్ సూచన





సత్యవేడు: మాట్లాడుతున్న తహసీల్దార్ జరీనా, పిచ్చాటూరు: సూచనలిస్తున్న తహసీల్దారు మధుసూధన్ రావు

సత్యవేడు: మండల పరిధిలో మిచాంగ్ తుపాన్‌పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వరద, చెరువు కట్టలు తెగిపోవడం, కాలువలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుంటే సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తహసీల్దార్ జరీనా సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, పోలీసు, ఫైర్, విద్యుత్, వ్యవసాయం, అంగన్‌వాడీ, ఎంఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సత్యవేడు పరిధిలో ప్రమాదాల వివరాలను తహసీల్దార్ కంట్రోల్ రూమ్ 6302345570, 9573661059 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. చెరువు కట్టలు తెగిపోకుండా నిఘా ఉంచాలన్నారు. హెడ్ క్వార్టర్‌లోనే అందరూ ఉండాలని 6వ తేదీ వరకు సెలవులు పెట్టకూడదని పేర్కొన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని తెలిపారు. వైద్య సిబ్బంది వర్షాలకు సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాలను ప్రజలు దాటకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్, డీటీ రవిచంద్ర, ఎంఈఓ కే. రవి, ఎంఈఓటూ ఉషా, ఏఓ మురళి, విద్యుత్ ఏఈ జగదీష్, ఫైర్ ఆఫీసర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన

పిచ్చాటూరు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు మధుసూదన్ రావు సూచించారు. శనివారం సాయంత్రం అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశమై ముందు జాగ్రత్తలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ తుపాన్ కారణంగా మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ అరణియార్‌తో పాటు మిగిలిన చెరువులపై నిఘా పెంచాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. పోలీసులు, వీఆర్‌ఓలు తమ పరిధిల్లోని నదులు, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నీరు ఎక్కువగా ప్రవహించే ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏఈలు లోకేశ్వర్ రెడ్డి, శివబాల, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ మమతబాయ్, ఎంఈఓ యుగంధర్ రాజు, ఏపీఓ నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు 1912కు ఫోన్ చేయండి



మాట్లాడుతున్న ఏఈ బాలాజీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో తొట్టంబేడు ఏఈ బాలాజీ అన్నారు. శనివారం ఏఈ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాన్ కారణంగా మండలంలో వర్షాలు కురుస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలకు పొలాల్లో విద్యుత్ స్టాటర్లు వర్షపు నీటిలో మునిగిపోయినా, సర్వీసు వైర్లు డామేజ్ అయినా, వైర్లు తెగిపోయినా తొందరపాటుతో ఎవరూ వాటిని తాకడం, సొంతంగా మరమ్మతులు చేసేందుకు యత్నించడం ప్రమాదకరమని సూచించారు. ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని తెలిపారు. లేక 1912 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

శ్రీకాళహస్తి: తుపాన్ ముప్పు తొలగేంత వరకు అధికారులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం. రమేష్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తుపాన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పట్టణంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే మున్సిపల్ సిబ్బంది పరిష్కరించాలని సూచించారు. పట్టణ ప్రజలు అత్యవసర దృష్ట్యా నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలిగినా 9000030436, 9100929870 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. పారిశుధ్య సమస్యల పరిష్కారానికి 9000060797, 8919351660 నంబర్‌లను సంప్రదించాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, 24 గంటలు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా 9908799039, 8978219995), 9885307393 నంబర్లకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

సత్యవేడు నియోజకవర్గంలో భారీ వర్షం



కలుజు పారుతున్న సంతవేలూరు చెరువు



నిండుగా ఉన్న పెద్ద పాండూరు చెరువు

వరదయ్యపాళెం: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సత్యవేడు నియోజకవర్గంలో మళ్లీ వర్షం ప్రారంభమైంది. శనివారం ఉదయం నుంచి కొంచెం తెరపి ఇవ్వగా, మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తోంది. సాయంత్రం 5గంటల వరకు 20.5మి.మీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గౌరిశంకరరావు తెలిపారు. ముందస్తు వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోనే అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

పొంగి పొర్లుతున్న చెరువులు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కాలువలు, గుంటలు, వాగులకు పెద్దఎత్తున నీరు చేరింది. దాదాపుగా మండలంలో ఉన్న 80 సాగునీటి చెరువులు కలుజులు పారుతున్నట్లు సమాచారం. ఇప్పటికే సంతవేలూరు మార్గంలో మార్లమడుగు, పులిబొంద, పాముల కాలువ వద్ద వరదనీరు ఉధృతం కావడంతో రాకపోకలు స్తంభించాయి. అంబికాపురం నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలో రాళ్ల కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు ఆగిపోయాయి.ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, మండల అధికారులు, స్థానిక వీఆర్‌ఏలు, విలేజ్ పోలీసుల ద్వారా భద్రతా చర్యలు చేపడుతున్నారు.

ఆలయంలో ఈఓ తనిఖీలు



మింట్‌ను పరిశీలిస్తున్న ఈఓ రామారావు



బాధితురాలికి గొలుసు అప్పగింత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలు విభాగాలను శనివారం ఈవో కేఎస్ రామారావు తనిఖీ చేశారు. ఆలయ ఆవరణంలోని మింట్, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. మింట్‌లో వెండి నాగపడగల తయారీని పరిశీలించారు. అనంతరం ఆలయంలో క్యూలు, భక్తుల రద్దీ క్రమబద్ధీకరణను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

ముక్కంటి సేవలో ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం రాష్ట్ర ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

బంగారు గొలుసు అప్పగింత

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ భక్తురాలు బంగారు గొలుసును శనివారం పోగొట్టుకుంది. ఈ నేపథ్యంలో ఇద్దరు బంగారు గొలుసు దొరికిందని హోంగార్డులకు అప్పగించారు. దానిని వారు ఆలయ అధికారులకు స్వాధీనం చేశారు. వారు ఆరా తీసి పశ్చిమగోదావరికి చెందిన లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు చెందిందిగా గుర్తించి అప్పగించారు. ఆలయ అధికారులు, హోంగార్డులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



బీఎన్‌కండ్రిగ : ఇంటింటి ప్రచారంలో నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: సచివాలయాల ద్వారా పార్టీలు,కులాలు,మతాలకతీంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని వీఎస్‌పురం సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్న పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నిండాయని, సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, గోపాల్‌రెడ్డి, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీ సంఘం సమావేశం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పెండ్లి మండపం పక్కనే ఉన్న చెంబేడువారి సత్రంలో ఆదివారం బీసీల సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని తెలియజేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. బీసీలందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఘనంగా డిజిటల్ లిటరసీ డే

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ డిజిటల్ లిటరసీడే(ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమన్నారు. సాంకేతికత అనేది మన జీవితంలో ఎలా భాగస్వామి అయ్యింది, దాని వల్ల ఉపయోగాలు.. దేశ అభివృద్ధిపై ప్రభావం తదితరాలను వివరించారు. అదే విధంగా స్మార్ట్‌ఫోన్లు, గూగుల్ వ్యవస్థ, మైక్రోసాఫ్ట్ వంటివి ఎలా అభివృద్ధి చెందాయో తెలియజేశారు. మనిషి దైనందిన జీవితంలో ఇవి ఎంత సాయపడుతున్నాయో వివరించారు. వైస్ ప్రిన్సిపల్ మురళి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పవిత్ర పుష్కరిణిని శుభ్ర పరచండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా ఉన్న భరద్వాజతీర్థంలోని పుష్కరిణిని శుభ్రం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు కోరారు. శనివారం బీజేపీ నాయకులు భరద్వాజతీర్థంలోని పుష్కరిణిని పరిశీలించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ భరద్వాజతీర్థంలోని పుష్కరిణిలో గతంలో రుషులు, మహర్షులు స్నానాలు ఆచరించి శివయ్యను దర్శించుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. అంతటి పవిత్రత ఉన్న పుష్కరిణి అపరిశుభ్రంగా మారిందన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు కార్తీకమాసం, ధనుర్మాసం, మాఘమాసంలో ఇక్కడ పూజలు చేస్తారన్నారు. అయ్యప్పస్వామి భక్తులు కూడా పుష్కరిణిలో స్నానమాచరిస్తారని తెలిపారు. పుష్కరిణిని శుభ్రపరిచి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. నాయకులు వాసు, అమర్‌నాథ్, ఢిల్లీ, సుకుమార్, మోహన్ రావు, కిరణ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 17 జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో హౌసింగ్ పథకం కింద 947 ఇళ్లు మంజూరు కాగా, అందులో కాలనీల్లో 722 ఇళ్లకు భూమి పూజ జరిగిందని, 602 పూర్తి అయ్యాయని తెలిపారు. 120 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, త్వరతిగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. వ్యక్తి గత ఇళ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేయించాలని తెలిపారు. వీరందరికి సిమెంట్‌తో పాటు బిల్లులను చెల్లించినట్లు పేర్కొన్నారు. ఏఓ త్రివిక్రమ్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

తిరుపతి కల్చరల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా కొంకా వీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ కేర్ సెంటర్‌లో ఆది, సోమ, మంగళవారం మూడు రోజులపాటు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ సెంటర్ అధినేత పి.గోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల నుంచి వయో వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారికి వినికిడి సమస్య, మాటలు రాని పిల్లలకు తగిన పరీక్షలు, కౌన్సిలింగ్ వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా హియరింగ్ ఎయిడ్ ట్రైల్స్, పాత హియరింగ్ ఎయిడ్స్‌పై ఎక్స్‌చేంజ్ ఆఫర్ వంటి సౌకర్యం, బ్లూటూత్, రీచార్జబుల్ హియరింగ్ అమర్చుకొనే ఏడాది అదనపు ఉచిత బ్యాటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు, సందేహాలకు 98490 85342 నెంబరులో సంప్రదించాలని తెలియజేశారు.

చెరువుకు నీటి మళ్లింపు



ఇసుక బస్తాలు వేస్తున్న రైతులు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం చెరువుకు శనివారం సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో నీటిని మళ్లించారు. రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్, వర్షంతో అటవీ ప్రాంతాల నుంచి వరవ కాల్వ ద్వారా నీరు కిందికి వెళుతోంది. గుర్తించిన రైతులు సర్పంచ్‌కు విన్నవించారు. సర్పంచ్ సూచనల మేరకు రైతులు ఇసుక బస్తాలను కాల్వకు వేసి చెరువుకు నీటిని మళ్లించారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డు తొలగింపు



తొలగించిన తాత్కాలిక రోడ్డు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద ఉన్న తాత్కాలిక రోడ్డును శనివారం తిరుపతికి చెందిన స్థానికేతరుడు జేసీబీతో తొలగించారు. సుమారు 6 నెలల క్రితం సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ నుంచి ఆరులేన్ల రోడ్డు వరకు జేసీబీతో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. భూములు తమవంటూ స్థానికేతర వ్యక్తి తొలగించడంతో ఎస్సీలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కండలేరులో 11.410 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 11.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 1750 క్యూసెక్కు ల నీరు చేరుతోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామికి విశేష పూజలు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిక్కవరానికి చెందిన కామిరెడ్డి అమరనాథ్‌రెడ్డి, శ్రీలత ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన సుమంత్‌రెడ్డి, పవిత్ర ఉభయదారులుగా వ్యవహరించారు. ఈవో తాతా శ్రీనివాసరావు, గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

జలపాతాల వద్ద ఆంక్షలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలోని జలపాతాల వద్దకు భక్తులు వెళ్లకుండా ఆంక్షలు విధించినట్టు ఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా పెంచలకోనలోని జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తాయని తెలిపారు. వాటిని చూసేందుకు వచ్చే భక్తులు కొండల్లో చిక్కుకుని ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే అనుమతిస్తున్నట్లు తెలిపారు.



జలపాతాల వద్దకు వెళ్లకుండా రోప్‌లు కడుతున్న అధికారులు